రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు 8125972476


క్విక్ టుడే



quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక


EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి సంపుటి : 3 సంచిక 83 సోమవారం 15 డిసెంబర్ 2025 | వెల : 3 రూ/.. పేజీలు - 8


# రెండో విడతలోనూ హస్తం హవా


## సగానికి పైగా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం

### రాష్ట్ర వ్యాప్తంగా 85.86 శాతం పోలింగ్



**హైదరాబాద్, డిసెంబర్14 (క్విక్ టుడే న్యూస్):**

తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడతలోనూ హస్తం హవా కొనసాగింది. అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతు దారులు 2297 సర్పంచి స్థానాల్లో విజయాలను తమ ఖాతాలో వేసుకున్నారు. బీఆర్ ఎస్ మద్దతుదారులు 1191, బీజేపీ మద్ద తుదారులు 257 స్థానాల్లో గెలుపొందారు. 578 స్థానాల్లో ఇతరులు విజయం సాధించారు. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 85.86 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రెండో విడతలో 3,911 సర్పంచ్, 29,917 వార్డు స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామ పంచాయతీల్లో ఓట్ల లెక్కింపును చెపట్టారు. దీంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. రెండో విడతలో 4,332 సర్పంచ్ స్థానాలకుగానూ 415, వార్డుల్లో 38,322కి గాను 8,304 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. తమ గ్రామ పరిపాలకులను ఎన్నుకునేందుకు ఉత్సాహంగా ఓటేశారు. పలుచోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారుల మధ్య స్వల్ప వాగ్వదాలు కూడా జరిగాయి.



# బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

**న్యూఢిల్లీ, డిసెంబర్14:**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్‌కు చెందిన నితిన్ నబిన్‌ను ఆ పార్టీ నియమించింది. ఆదివారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన

మిగతా 2లో



# బీజేపీతో ఈసీ కుమ్మక్కు

### ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ భారీ నిరసన సభ

### "ఓట్ల దొంగ.. గద్దె దిగు" నినాదంతో హోరెత్తిన సభా ప్రాంగణం

### సత్యంతోనే మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామన్న రాహుల్ గాంధీ

### 2026లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం

**న్యూఢిల్లీ, డిసెంబర్14:**

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కైందని కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆ పార్టీ ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఓట్ల దొంగ.. గద్దె దిగు' పేరిట

మిగతా 2లో



# ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తాం

### ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, డిసెంబర్14**

ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తామంటూ పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. ఢిల్లీని ఆక్రమిస్తాం అనే అర్థం వచ్చేలా ఈ వ్యాఖ్య చేశాడు. అదేవిధంగా

మిగతా 2లో



### సౌతాఫ్రికాలో కుప్పకూలిన అహోబిలం

# ఆలయ నిర్మాణం

### నలుగురు దుర్మరణం

**న్యూఢిల్లీ, డిసెంబర్14:**

సౌతాఫ్రికాలో కొత్తగా నిర్మిస్తున్న న్యూ అహోబిలం ఆలయం కుప్పకూలింది. ఆ దేశంలోని డర్బన్ నగరం సమీపంలోని ఓ పట్టణంలో నిర్మాణంలో నాలుగం తస్తుల న్యూ అహోబిలం

మిగతా 2లో

# ఆస్ట్రేలియా బీచ్‌లో ఉగ్ర ఘాతుకం

### యూదుల హనుక్కా ఉత్సవంపై కాల్పులు

### 10మంది మృతి.. ఇద్దరు పోలీసులు సహా 30మందికి గాయాలు



**సిడ్నీ, డిసెంబర్14:**

ఆస్ట్రేలియాలో యూదుల హనుక్కా ఉత్సవంపై ఉగ్ర ఘాతుకం చోటుచేసుకుంది. క్రిస్మస్ సందర్భంగా రద్దీగా ఉండే సిడ్నీలోని బాండీ బీచ్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ పోలీసు అధికారి సహా 10 మంది మరణించారు. ఇద్దరు పోలీసులు సహా 30 మంది గాయపడ్డారు. బాధితుల్లో చిన్నారులు కూడా

మిగతా 2లో

RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే QUICK TODAY


సోమవారం 15 డిసెంబర్ 2025 quicktodaynews.com



# బీజేపీతో ఈసీ కుమ్మక్కు



భారీ నిరసన సభ నిర్వహించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సోనియా గాంధీ సహా పలువురు సీనియర్ నేతలు, వేలాది మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ... ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి.. బీజేపీ కోసం పనిచేస్తున్నారని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. "సత్యానికి, అసత్యానికి మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో ఎన్నికల సంఘం బీజేపీ వైపు నిలబడింది. బీజేపీ ఎన్నికల సమయంలో రూ.10,000 పంపిణీ చేసినా ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు" అని ఆయన విమర్శించారు. తాము సత్యం వైపు నిలబడి నరేంద్ర మోదీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ధీమా వ్యక్తం చేశారు. "అధికారం ఉన్నవారినే ప్రపంచం గౌరవిస్తుందని, సత్యానికి విలువ లేదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ భావన. కానీ మా సిద్ధాంతం ప్రకారం సత్యమే అత్యంత ముఖ్యమైనది. ఆ సత్యంతోనే మేము మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని దేశం నుంచి తొలగిస్తాం" అని రాహుల్ ప్రతిజ్ఞ చేశారు. బీహార్‌లో జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర'తో ప్రారంభమైన 'ఓట్ల చోరీ' ప్రచారాన్ని దేశవ్యాప్తంగా ఉద్ధృతం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. గతంలో కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో ఓట్ల జాబితాలో అవకతవకలు జరిగాయని రాహుల్ ఆరోపించగా, ఈసీ వాటిని నిరాధారమైనవని కొట్టిపారేసిన విషయం తెలిసిందే... 2026లో అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేయడం ప్రాముఖ్యతను సంతరించుకుంది.



## సౌతాఫ్రికాలో కుప్పకూలిన అహోబిలం

# ఆలయ నిర్మాణం

ఆలయం శుక్రవారం కూలిపోయిందని అక్కడి అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. ప్రమాద సమయంలో కార్మికులు, పలువురు ఆలయ అధికారులు విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో భారత సంతతికి చెందిన వ్యక్తి కూడా ఉన్నట్లు సమాచారం. ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక కార్యక్రమాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అయితే శిథిలాల కింద ఎంత మంది చిక్కుకున్నారనే విషయంపై ఇంకా స్పష్టతలేదన్నారు. శిథిలాలు టన్నుల కొద్దీ ఉండటంతో వాటిని తొలగించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. ప్రమాదంలో మరణించిన భారత సంతతి వ్యక్తిని ఆలయ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ విక్కీ జైరాజ్ పాండేగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దాదాపు రెండేళ్లుగా ఆయన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదని అధికారులు పేర్కొన్నారు.

# ఢిల్లీని పెళ్లిపిల్లను చేస్తాం



భారత వైమానిక దళంపై కూడా అతను నోరుపారేసుకున్నాడు. లష్కరే వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు అబ్దుల్ రవూఫ్ అత్యంత సన్నిహితుడు. పాకిస్తాన్ ఆర్మీ అతడిని గతంలో సాధారణ పౌరుడిగా, అమాయకుడిగా ప్రకటించింది. అయితే ఆయన ఇప్పుడు భారత్‌పై దాడులకు బహిరంగంగా పిలుపునిస్తూ చేసిన వ్యాఖ్యల్లో అతడిలోని ఉగ్ర భావజాలం స్పష్టమవుతున్నది. తాజాగా ఆయన మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్‌లో ఇంకా పోరాటం ముగియలేదని, వివాదం మరింత తీవ్రమవుతుందని హెచ్చరికలు జారీ చేశాడు. ఎల్ఈటీ సహ వ్యవస్థాపకుడు అబ్దుల్ రెహమాన్ మక్కీని ఉద్దేశిస్తూ.. భారత రాజధానిని స్వాధీనం చేసుకోవడమే తమ గ్రూపు లక్ష్యమన్నాడు. ఈ సందర్భంగా ఢిల్లీని ఆక్రమిస్తామంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశాడు. భారత సైనిక శక్తిపై కూడా రవూఫ్ నోరుపారేసుకున్నాడు. భారత్‌కు చెందిన రఫేల్ యుద్ధవిమానాలు, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు అసమర్థమైనవిగా పేర్కొన్నారు. భారత వైమానిక దళం పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించే ధైర్యం చేయదని వివాదాస్పదంగా వ్యాఖ్యానించాడు. ఇస్లామిక్ దేశాల్లో పాకిస్థాన్ వద్ద మాత్రమే అసలైన అణ్వాయుధాలు ఉన్నట్లు తెలిపాడు.

# బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్



నియామకాన్ని పార్టీ పార్లమెంటరీ బోర్డు కూడా ఆమోదించినట్లు పేర్కొన్నారు. నితిన్ నబిన్ పదోన్నతిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. పార్టీలో ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించారని, అంకితభావంతో కూడిన కార్యకర్తగా ఆయనను అభివర్ణించారు. కాగా, నితిన్ నబిన్ ప్రస్తుతం సీఎం నితీశ్ కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణ మంత్రిత్వ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఐదుసార్లు బీహార్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన కాయస్థ వర్గానికి చెందినవారిగా సమాచారం. ప్రస్తుత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్థానాన్ని నితిన్ నబిన్ భర్తీ చేయనున్నారు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ, తనకు ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీ, సీనియర్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ, ప్రధాని మోదీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.

## ఆస్ట్రేలియా బీచ్‌లో

# ఉగ్ర ఘాతుకం



ఉన్నారు. ఇది యూదుల లక్ష్యంగా జరిగిన దాడి అని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఉగ్ర దాడిలో ఒక ఉగ్రవాది నవీద్ అక్రమ్ అని పోలీసులు గుర్తించారు. ఇతను నైరుతి సిడ్నీలోని బోన్నీరిగ్‌లో నివసిస్తున్నట్లు తెలిపారు. కొన్ని నెలలుగా ప్రణాళిక రచించి, ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఓ ఉగ్రవాది హతం కాగా మరొకడు తీవ్రంగా గాయపడ్డాడు. నిందితుల్లో ఒకరు పాక్ సంతతి వ్యక్తి అని సమాచారం. ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన బెల్ట్‌లను ధరించినట్లు చెప్పారు. హుటాహుటిన హెలికాప్టర్లు, ఇంటెన్సివ్ కేర్ పారామెడిక్స్, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్స్ సహా 26 యూనిట్లను మోహరించారు. బాండీ బీచ్‌కు ప్రతి రోజూ వేలాది మంది సందర్శకులు వస్తారు. 11 ఏళ్ల క్రితం ఓ దుండగుడు ఇక్కడ 18 మందిని నిర్బంధించాడు. ఉగ్రదాడి నుంచి ప్రముఖ మాజీ క్రికెటర్ మైకెల్ వాన్ తృటిలో తప్పించుకున్నారు. ఆస్ట్రేలియా బీచ్ దాడిని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ప్రధాని ఆంథోనీ అల్బనీస్ కార్యాలయం స్పందించింది. పరిస్థితిని సమీక్షిస్తున్నామని, ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని కోరింది.